సాక్షి
పార్వతీపురం మన్యం

శనివారం । 4 । ఫిబ్రవరి । 2023



హోరాహోరీగా ఎస్‌పీఎల్ క్రికెట్ లీగ్

సాక్షి మీడియా ఆధ్వర్యంలో స్థానిక జేఎన్‌టీయూ గురజాడ విశ్వవిద్యాలయం మైదానంలో మూడో రోజు సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ మ్యాచ్‌లు హోరాహోరీగా సాగాయి.

- 8లో



చెరకు తోటల్లో ఏనుగులు

భామిని: మండలంలోని పసుకుడి వంశధార నదీ తీరంలోని చెరకు తోటల్లో ఏనుగుల గుంపు సంచరిస్తోంది. పంటకు నష్టం చేకూరుస్తుండడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు.

విశ్వనాథుని వర్ణచిత్రం

గరుగుబిల్లి: మండలంలోని నాగూరుకు చెందిన నఖ చిత్రకారుడు పల్ల పరిశినాయుడు వర్ణ చిత్రంతో కళా తపస్వి కె.విశ్వనాథ్‌కు నివాళు లర్పించారు.



న్యూస్‌రీల్

ఆలయాల నిర్మాణానికి స్థల పరిశీలన



పెద్దూరులో స్థల పరిశీలన చేస్తున్న ఎండోమెంట్ అధికారులు

సీతంపేట: టీటీడీ నిధులతో రాష్ట్రవ్యాప్తంగా దేవాలయాలు నిర్మిస్తున్నట్టు జిల్లా ఎండో మెంట్ అధికారి కె.ఎల్ సుధారాణి తెలిపారు. సీతంపేట, పెద్దూరు, వలగెడ్డ, కొత్త, పాతపనుకువలస, కారెంబంబడుగూడలలో ఆలయాల నిర్మాణానికి అవసరమైన స్థలాలను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో 103 దేవాలయాల ఏర్పాటుకు నిధులు మంజూరయ్యాయన్నారు. ఒక్కో ఆలయ నిర్మాణానికి రూ.10 లక్షల చొప్పున నిధులు కేటాయిస్తున్నామన్నారు. గుడి నిర్మాణానికి రూ.8లక్షలు, విగ్రహాలకు రూ.2లక్షల చొప్పున వెచ్చిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఈఈ సీహెచ్ వెంకటరమణ, జేఈ రమేష్, సీనియర్ సహాయకులు నరసింహమూర్తి, అర్చకులు వేమకోటి సాయికృష్ణశర్మ పాల్గొన్నారు.

పైడితల్లి హుండీల ఆదాయం లెక్కింపు



హుండీల ఆదాయం లెక్కింపును పర్యవేక్షిస్తున్న ఈఓ కిశోర్‌కుమార్, ట్రస్ట్ బోర్డు సభ్యులు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పైడితల్లి అమ్మవారి హుండీల ఆదాయాన్ని శివాలయం వీధిలో ఉన్న అమ్మవారి కల్యాణ మండపం ఆవరణలో శుక్రవారం లెక్కించారు. చదురుగుడిలోని హుండీల ద్వారా రూ. 31,90,401 నగదుతో పాటు 41 గ్రాముల 600 మిల్లీగ్రాముల బంగారం, 581 గ్రాముల వెండి లభించిందన్నారు. వీటితో పాటు ఒక అమెరికన్ డాలర్, 20 యూరోస్, ఐదు ఆస్ట్రేలియా డాలర్స్, కువైట్ దినర్, సెంట్‌యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ఫారెన్ కరెన్సీ లభించాయి. వనంగుడి హుండీల నుంచి రూ.6,83,544లు, 4 గ్రాముల 600 మిల్లీ గ్రాముల బంగారం, 87 గ్రాముల వెండి లభించినట్టు ఆలయ ఈఓ బీహెచ్‌వీఎస్ఎన్ కిశోర్‌కుమార్ తెలిపారు. 71 రోజులకు హుండీల ఆదాయం లెక్కించినట్టు వెల్లడించారు. కార్యక్రమంలో హుండీల పర్యవేక్షణాధికారి డీవీవీ ప్రసాదరావు, ట్రస్టు బోర్డు సభ్యులు డాక్టర్ సత్తి అచ్చిరెడ్డి, నక్కా జ్యోతి, రామ్‌సింగ్ సూరమ్మ, గొర్లె ఉమ, బలివాడ పార్వతి, మూడు జిల్లాల నుంచి శ్రీవారి సేవకులు, ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వాల్తేర్ డివిజన్‌కు రూ.2857.85 కోట్లు కేటాయింపు



విజయనగరం టౌన్: ఈస్ట్‌కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్‌కు 2023–24 బడ్జెట్‌లో రూ. 2857.85 కోట్లు కేటాయించినట్టు సీనియర్ డీసీఎం ఎ.కె.త్రిపాఠి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీటిలో విజయనగరం–సంబల్‌పూర్ (టిట్లాఘర్) మూడోలైన్ (264.60 కిలోమీటర్లు) నిర్మాణానికి 920 కోట్లు, కొత్తవలస–కోరాపుట్ (189.278 కిలోమీటర్లకు) రూ. 410 కోట్లు కేటాయింపులు జరిగాయన్నారు. గోపాలపట్నం–విజయనగరం వరకూ ఆటో సిగ్నలింగ్ వ్యవస్థ, బైపాస్‌లైన్‌లు ఏర్పాటుకు రూ. 32.78 కోట్లు, రోడ్డు సేఫ్టీ వర్క్స్, అండర్ బ్రిడ్జిలకు సంబంధించి గుమడ–పార్వతీపురం ఆర్‌ఓబీకి రూ.60 లక్షలు, పలాస–పూండి లైన్‌కు రూ.2.05 కోట్లు, పొందూరు–సిగడం రోడ్డు ఓవర్ బ్రిడ్జికి రూ.1.50 కోట్లు, కోమటిపల్లి–గజపతినగరం ఆర్‌ఓబీ లెవెల్ క్రాసింగ్ రూ. 2 లక్షలు, పలాస–పూండి, నౌపడలలో లిమిటెడ్ హైట్ సబ్‌వేస్‌కు రూ.3.71 కోట్లు, కోటబొమ్మాళి–తిలారు, పలాస–పూండి, కోటబొమ్మాళి యార్డ్‌లలో లిమిటెడ్ హైట్ సబ్‌వేస్‌కు రూ.3.2కోట్లు, కొత్తవలస– కిరండాల్ సబ్‌వేస్ లెవెల్ క్రాసింగ్‌లకు రూ.78 లక్షలు, నౌపాడ–కోటబొమ్మాళి ఆర్‌ఓబీ సబ్‌వేకు రూ.2 కోట్లు, ఉర్లాం–శ్రీకాకుళం ఆర్‌ఓబీకి రూ.2 కోట్లు కేటాయింపులు చేశారని పేర్కొన్నారు. రైల్వే ట్రాక్‌ల ఆధునికీరణకు సంబంధించి పలాస–విశాఖ–దువ్వాడకు రూ.40 కోట్లు, కోరాపుట్ –సింగపూర్ లైన్‌కు రూ.20.01 కోట్లు, సింగపూర్ –విజయనగరం రోడ్డుకు రూ.25 కోట్లు కేటాయించారన్నారు. రైల్వే అధికారులు, సిబ్బంది క్వార్టర్స్ ఆధునికీకరణ, రిపేర్లకు సంబంధించి రూ.15 లక్షలు కేటాయింపులు జరిగాయన్నారు. వీటితో పాటు సిగ్నల్ అండ్ టెలికమ్, వర్క్‌షాప్ ప్రొడక్షన్ యూనిట్స్, కొత్త లైన్లు, డబ్లింగ్ పనులు, రీమోడలింగ్స్, కొన్ని ప్రత్యేక గుర్తింపు పొందిన పనులకు నిధులు కేటాయించారన్నారు.

- సీతంపేటలో చురుగ్గా మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం
- రూ.49.26 కోట్లతో పనులు
- మరో రూ.19 కోట్లతో ఏరియా ఆస్పత్రికి అదనపు భవనాలు
- అందుబాటులో స్పెషలిస్ట్ డాక్టర్లు
- ఎక్స్‌రే, స్కానింగ్ యంత్రాల ఏర్పాటు
- ప్రాంతీయ ఆస్పత్రిలో నెలకు 100 నుంచి 120 ప్రసవాలు
- అందుబాటులో 37 ఆక్సిజన్ బెడ్‌లు



ఆక్సిజన్ బెడ్‌పై ఉన్న రోగికి సేవలు అందిస్తున్న వైద్యులు

ఆదివాసీలకు వైద్య భరోసా

సీతంపేట:

ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందజేయడమే లక్ష్యంగా జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఇప్పటికే జిల్లాకో వైద్యకళాశాలను మంజూరు చేసింది. కొన్నిచోట్ల భవన నిర్మాణాలను ప్రారంభించింది. మరోవైపు ప్రాంతీయ ఆస్పత్రులను ఆధునీకరిస్తోంది. యంత్ర పరికరాలు సమకూర్చుతోంది. గిరిజన ప్రాంతాల ప్రజలు అత్యవసర వేళ వైద్యసేవల కోసం పరుగుల తీయకుండా సకల సదుపాయాలు కల్పిస్తోంది. మెరుగైన వైద్యం అందించేలా వైద్యులు, సిబ్బంది పోస్టులను భర్తీచేసింది. దీనికి సీతంపేటలోని ఏరియా ఆస్పత్రే నిలువెత్తు నిదర్శనం. మరోవైపు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని నిర్మాణం చురుగ్గా సాగుతుండడంతో ఆదివాసీల్లో ఆనందం వెల్లివిరుస్తోంది.

చురుగ్గా నిర్మాణం..



చురుగ్గా జరుగుతున్న మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి పనులు

ఆదివాసీలకు కార్పొరేట్ తరహా వైద్యం అందివ్వాలనే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పానికి అనుగుణంగా సీతంపేటలో మల్టీ సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి భవన నిర్మాణాలు సాగుతున్నాయి. నాబార్డు నిధులు రూ.49.26 కోట్ల వ్యయంతో గత ఏడాది పనులు ప్రారంభించారు. ఈ ఏడాది డిసెంబర్ నాటికి పనులు పూర్తికావాల్సి ఉంది. పనులు పిల్లర్ల దశలో ఉన్నాయి. ఆస్పత్రి నిర్మాణం పూర్తయితే పాలకొండ, భామిని, వీరఘట్టం, సీతంపేట, ఒడిశా సరిహద్దున ఉన్న గ్రామాలతో పాటు శ్రీకాకుళం జిల్లా పరిధిలోని కొత్తూరు, హిరమండలం, మెళియాపుట్టి, పాతపట్నం తదితర మండలాల గిరిజనులకు మెరుగైన వైద్యసేవలు అందనున్నాయి. ఇప్పుడున్న ఏరియా ఆస్పత్రిని వంద పడకలకు స్థాయి పెంచుతూ రూ.19 కోట్లతో పనులు జరుగుతున్నాయి. ఒక విభాగంలో పనులు పూర్తయ్యాయి. అన్ని వైద్య సౌకర్యాలు ఉండడంతో సీతంపేటతో పాటు ఇతర మండలాల నుంచి రోగుల తాకిడి పెరిగింది.

శిశువులకు ఎస్ఎన్‌సీయూ

స్పెషల్ న్యూ బోర్న్ కేర్ యూనిట్ ద్వారా అప్పుడే పుట్టిన నవజాత శిశువులకు ప్రత్యేక వైద్యం అందుతోంది. ఫొటో థెరపీ, సీప్యాప్, వార్మర్లు, వెంటిలేటర్లు వంటి సౌకర్యాలు ఉన్నాయి. పోషకాహార లోప చిన్నారులకు న్యూట్రీషియన్ రిహెబిలిటేషన్ సెంటర్ ద్వారా పోషకాహారాన్ని అందిస్తున్నారు. బరువు తక్కువ ఉన్న చిన్నారులను ఇక్కడ చేర్పించి న్యూట్రీషియన్ ఆహారాన్ని అందించి పిల్లలకు ఆరోగ్య భరోసా కల్పిస్తున్నారు. ఆస్పత్రిలో ఫిజియోథెరపీ యూనిట్‌ను ఏర్పాటు చేసి సేవలందిస్తున్నారు.

సేవల్లో ముందంజ

ఆరోగ్యశ్రీ సేవల్లో సీతంపేట ఏరియా ఆస్పత్రి రాష్ట్రంలోనే మూడో స్థానం దక్కించుకుంది. ఈఎన్‌టీ, ఆర్థో శస్త్ర చికిత్సలు కూడా ఆస్పత్రిలో ప్రారంభమయ్యాయి. వార్డులో 37 ఆక్సిజన్ బెడ్లు ఏర్పాటు చేశారు. ఎక్స్‌రే, గైనిక్ స్కానింగ్ యంత్రాలు అందుబాటులో ఉన్నాయి. అన్ని రకాల రక్త పరీక్షలు చేసేందుకు నిపుణులైన సిబ్బంది ఉన్నారు. మందులు అందుబాటులో ఉన్నాయి. జనరల్ మెడిషన్, గైనిక్, ఈఎన్‌టీ, ఆర్థో, పిడియాట్రిక్, డెంటిస్ట్ సేవలకు నిపుణులైన వైద్యులు ఉన్నారు.



ఎక్స్‌రే యూనిట్

రెగ్యులర్ సిబ్బంది 28, కాంట్రాక్టు సిబ్బంది 20, అవుట్ సోర్సింగ్ 16 మంది పనిచేస్తున్నారు. నెలకు 100 నుంచి 120 వరకు ఆస్పత్రిలో ప్రసవాలు జరుగుతున్నాయి.

మెరుగైన వైద్యం



అన్ని రకాల వైద్యసేవలు అందిస్తున్నాం. రిఫరల్ కేసులు తగ్గించాం. అన్ని రకాల వైద్య పరీక్షలను ఏరియా ఆస్పత్రిలో చేస్తున్నాం. దీనికోసం ప్రభుత్వం ఆధునిక వైద్యపరికరాలను కేటాయించింది. మందులన్నీ అందుబాటులో ఉన్నాయి. ప్రజారోగ్య పరిరక్షణే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం.

– బి.శ్రీనివాసరావు, ఏరియా ఆస్పత్రి సూపరెంటెండెంట్, సీతంపేట

గిరిజన ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



గిరిజనుల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. దీనిలో భాగంగానే సీతంపేటకు మల్టీ సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి మంజూరు చేసింది. ఏరియా ఆస్పత్రిలో ఇప్పటికే అన్ని రకాల వైద్య సౌకర్యాలు అందిస్తున్నారు. భవిష్యత్‌లో మరింత మెరుగైన వైద్యసేవలు అందనున్నాయి. త్వరలోనే వసతి సమస్య కూడా తీరనుంది.

– విశ్వాసరాయి కళావతి, పాలకొండ ఎమ్మెల్యే



సీతంపేట ఏరియా ఆస్పత్రి



ఆస్పత్రిలో మందుల నిల్వలు

ఓపెన్ స్కూల్ పరీక్షల షెడ్యూల్ విడుదల



సీహెచ్ శ్రీనివాసరావు

పార్వతీపురం టౌన్: ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించే పదవ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల షెడ్యూల్ విడుదలైనట్టు జిల్లా ఓపెన్ స్కూల్ పరీక్షల కోఆర్డినేటర్ సీహెచ్ శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓపెన్ స్కూల్ పరీక్షలు ఏప్రిల్ 3వ తేదీ నుంచి 17 వరకు కొనసాగుతాయన్నారు. పదవ తరగతి పరీక్షకు ఒక్కో సబ్జెక్టుకు రూ.100, ఇంటర్మీడియట్ పరీక్షకు థియరీ ఒక సబ్జెక్టు రూ.150, ప్రాక్టికల్ పరీక్షకు రూ.100 చొప్పున చెల్లించాలని పేర్కొన్నారు. సప్లిమెంటరీ విద్యార్థులు ఇంటర్మీడియట్ థియరీ ఒక సబ్జెక్టు రూ.250, ప్రాక్టికల్స్‌కు రూ.100 చొప్పున చెల్లించాలన్నారు. ఇంప్రూవ్‌మెంట్ విద్యార్థులు ఇంటర్మీడియట్ థియరీ పరీక్షకు సబ్జెక్టుకు రూ.250, ప్రాక్టికల్‌కు రూ. 100 చెల్లించాల్సి ఉంటుందన్నారు. పరీక్ష ఫీజులను ఎటువంటి అపరాధ రుసుం లేకుండా ఈ నెల 15వతేదీ వరకు, రూ.25 అపరాధ రుసుముతో ఈనెల 22వ తేదీ వరకు, రూ.50 అపరాధ రుసుముతో మార్చినెల 2వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. వివరాలకు సమీపంలోని స్టడీ సెంటర్ల కో–ఆర్డినేటర్లను, ఓపెన్ స్కూల్ జిల్లా కార్యాలయంలోని సిబ్బందిని సంప్రదించాలని కోరారు.

రామతీర్థంలో నేడు రథయాత్ర

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన రామతీర్థంలో శనివారం రాత్రి రథయాత్ర మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. స్వామివారి పందిరి రాటను పురస్కరించుకుని రథసప్తమి పర్వదినాన సీతారామునిపేట గ్రామస్తులు రథాన్ని ఆలయం వద్దకు తీసుకువచ్చి నూతన హంగులతో సుందరంగా తీర్చిదిద్ది రథయాత్రకు సిద్ధం చేశారు. ప్రతి ఏటా మాఘమాసంలో నిర్వహిస్తున్న రథయాత్ర మహోత్సవానికి దేవస్థానం అధికారులు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. రాత్రి 10గంటలకు రథంలో సీతాసమేత శ్రీరామచంద్ర ప్రభువును రామతీర్థం తిరువీధుల్లో మంగళవాయిద్యాలు, అశేష భక్తజనం నడుమ ఊరేగించనున్నారు.

పౌష్టికాహారంతో రక్తహీనతకు చెక్

- వైద్య ఆరోగ్యశాఖాధికారి జగన్నాథరావు



పార్వతీపురంటౌన్: జిల్లాలోని గర్భిణులు, బాలింతలు, పిల్లల్లో రక్తహీనత నివారణకు జిల్లా యంత్రాంగం కలిసికట్టుగా పనిచేస్తోందని, పౌష్టికాహారం తీసుకోవడం వల్ల రక్తహీనతను అధిగమించవచ్చని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి బగాది జగన్నాథరావు తెలిపారు. స్థానిక విలేకరులతో ఆయన శుక్రవారం మాట్లాడుతూ వైద్యఆరోగ్య శాఖ, మహిళాశిశు సంక్షేమ శాఖ, విద్యా శాఖలను సమయాత్తపరచి రక్తహీనతను అధిగమించే చర్యలు చేపడుతున్నామన్నారు. జిల్లాలో 10 నుంచి 19 సంవత్సరాల వయస్సుగల 27,594 మంది బాలికల రక్తనమూనాలు సేకరించి హిమోగ్లోబిన్ పరిశీలించగా 70 మందిలో తీవ్ర రక్తహీనత, 16,880 మధ్యస్త, 6,776 మందిలో తేలికపాటి రత్తహీనత ఉన్నట్లు నమోదయిందన్నారు. 7,372 మంది గర్భిణులను పరీక్షించగా 1378 మందిలో మధ్యస్త, 3,065 మందిలో తేలికపాటి రక్తహీనత ఉన్నట్టు నిర్ధారణ అయిందన్నారు. 2,431 మంది బాలింతలను పరీక్షించగా 561 మందిలో మధ్యస్త, 1,049 మంది తేలికపాటి రక్తహీనతతో బాధపడుతున్నట్టు నివేదికలు వచ్చాయని పేర్కొన్నారు. హిమోగ్లోబిన్ 7 గ్రాముల కంటే తక్కువ ఉంటే తీవ్ర రక్తహీనతగా, 7–9 గ్రాముల మధ్య ఉంటే మధ్యస్థ, 9–11 గ్రాముల మధ్య ఉంటే తేలికపాటి రక్తహీనతగా పరిగణిస్తామని తెలిపారు. రక్తహీనతతో బాధపడుతున్న వారు తీసుకోవాల్సిన ఆహారం, ఆరోగ్య జాగ్రత్తలను ఏఎన్ఎం, ఆశ, అంగన్వాడీ కార్యకర్తలు ద్వారా అవగాహన కల్పిస్తున్నామని స్పష్టంచేశారు.

రక్తహీనత నివారణ మార్గాలు ఇవే...

- ప్రతి ఆరునెలలకు ఒకసారి పిల్లలతో అల్బెండజోల్ మందు తాగించాలి.
- గర్భిణులు, పిల్లలు, బాలింతలు మలేరియా వ్యాధి బారిన పడకుండా చూడాలి.
- తట్టు, న్యుమోనియా వంటి అంటువ్యాధుల నివారణకు టీకాలు వేయించాలి.
- వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్ కింద అందిస్తున్న పౌష్టికాహారాన్ని తీసుకోవాలి.

పేద విద్యార్థుల విదేశీ విద్యకు సహాయం

- జిల్లా కలెక్టర్ నిషాంత్‌కుమార్



వర్చువల్ సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే పేద విద్యార్థులు జగనన్న విదేశీ విద్యా దీవెన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ నిషాంత్‌కుమార్ పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్ విధానంలో శుక్రవారం నిర్వహించిన జగనన్న విదేశీ విద్యాదీవెన కార్యక్రమానికి కలెక్టర్ నిషాంత్‌కుమార్, వివిధ కళాశాలల విద్యార్థులు కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విదేశీ విద్యను అభ్యసించాలనుకునే పేద విద్యార్థులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం జగనన్న విదేశీ విద్యాదీవెన పథకాన్ని అమలు చేస్తోందన్నారు. విదేశీ యూనివర్సిటీలలో ప్రవేశాలు పొంది, కుటుంబ వార్షిక ఆదాయ పరిమితి ఎనిమిది లక్షల రూపాయలలోపు గల షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు జాతులు, మైనారిటీ, వెనుకబడిన తరగతులు, అల్పాదాయం గల ఉన్నత వర్గాల విద్యార్థులు పథకాన్ని వినియోగించుకొని ఉన్నత విదేశీ విద్యను అభ్యసించాలని కోరారు. ప్రపంచ వ్యాప్తంగా 100 టాప్ ర్యాంకు గలిగిన యూనివర్సిటీలలో చదువుకునేందుకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు గరిష్టంగా రూ.1.25 కోట్లు వరకు, మిగిలిన వారికి గరిష్టంగా కోటిరూపాయల వరకు, 100 నుంచి 200 ర్యాంకు కలిగిన యూనివర్సిటీలలో ర్యాంకులు పొందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు గరిష్టంగా రూ. 75 లక్షల వరకు నూరు శాతం ట్యూషన్ ఫీజు రీయింబర్స్‌మెంట్, మిగిలిన విద్యార్థులకు గరిష్టంగా రూ.50లక్షలు లేదా ట్యూషన్ ఫీజులో 50 శాతం ఏది తక్కువైతే అది ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. విద్యార్థులకు విమాన, వీసా చార్జీలను సైతం రీయింబర్స్‌మెంట్ చేస్తుందని, విద్యార్థులు బాగా చదువుకుని దేశానికి పేరుతేవాలని కోరారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ అధికారి మహమ్మద్ గయాజుద్దీన్, బీసీ వెల్ఫేర్ అధికారి ఎస్.కృష్ణ పాల్గొన్నారు.

విద్యలనగరంతో విడదీయలేని విశ్వనాథ్ అనుబంధం

- గురజాడ , ఆత్రేయ పురస్కారాలను అందుకున్న విశ్వనాథ్
- కళాతపస్వికి కన్నీటి వీడ్కోలు పలికిన జిల్లా ప్రజలు
- ఆయన జ్ఞాపకాలను గుర్తుచేసుకున్న కళాపీఠాలు

విజయనగరం టౌన్: కళలకు పుట్టినిల్లుగా పేరుగాంచిన విజయనగరంలో అడుగుపెట్టని మహనీయులు ఉండరు. అవకాశం వచ్చినప్పుడల్లా విద్యలనగరాన్ని సందర్శించేందుకు ఉత్సాహం చూపుతారు. అటువంటి మహనీయుల్లో కళాతపస్వి కె.విశ్వనాథ్ ఒకరు. వెండితెర కాన్వాసుపైన తన సృజనాత్మక కుంచెతో అద్భుత కథా కథన వర్ణాలతో అపురూప చిత్రాలను చిత్రించిన మహా చిత్రకారుడుగా గుర్తింపు పొందారు. తెలుగు సినీకేతనాన్ని అంతర్జాతీయ వినువీధుల్లో కనువిందుగా ఎగురవేసిన లబ్ధప్రతిష్టుడు, ప్రేక్షక హృదయాల్లో సుప్రతిష్టుడు విశ్వనాథుడు. అటువంటి మహనీయునికి విజయనగరం గురజాడ సాంస్కృతిక సమాఖ్య 2003లో గురజాడ విశిష్ట పురస్కారాన్ని ప్రదానం చేసింది. ఆత్రేయ కళాపీఠం కూడా అదే ఏడాది ఆత్రేయ పురస్కారంతో సత్కరించింది. శుభ సంకల్పం సినిమాను విజయనగరం పరిసర ప్రాంతాల్లో 1994లో చిత్రీకరించినప్పుడు ఆంధ్రజాలరి నృత్యాన్ని డి.వై.సంపత్‌కుమార్ శిక్షణలో కమల్‌హాసన్‌తో పలు అంశాలను చిత్రీకరించారు. అదే సమయంలో హస్తబల్ హాల్‌లో నిర్వహించిన సత్కార సభలో విశ్వనాథ్ పాల్గొన్నారు. ఆత్రేయ స్మారక కళాపీఠం అధ్యక్షుడు ఉసిరికల చంద్రశేఖర్ షష్టిపూర్తి కార్యక్రమానికి వేటూరితో కలిసి వచ్చారు. 2010లో శుభప్రదం సినిమా చిత్రీకరించేందుకు రోటరీ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. 2006లో కొత్త అగ్రహారం శివ్వా నానాజీ ఇంట్లో ఉంటూ బాబామెట్టలో సంప్రదాయ వైద్యుడు రజనీకాంత్ వద్ద మోకాళ్ల నొప్పులకు 15 రోజుల పాటు ఆయన చికిత్సపొందారు. ఆ సమయంలోనే ఆనంద గజపతి కళాక్షేత్రంలో జిల్లాకు చెందన యువ గాయనీ, గాయకులతో ఏర్పాటుచేసిన సంగీత విభావరిలో పాల్గొన్నారు. రాత్రి 10.30 గంటల వరకూ ఆస్వాదించి తన జీవితంలో ఇది మరిచిపోలేనిదిగా పేర్కొన్నారు. 2016లో రామనారాయణం ప్రాంగణాన్ని సందర్శించి, ఆ ప్రాంగణ వైభవాన్ని మెచ్చుకున్నారు.

అభిమానుల ఘన నివాళి

కళాతపస్వి, దాదా సాహెబ్ పాల్కే అవార్డు గ్రహీత కె.విశ్వనాథ్ మృతి కళారంగానికి తీరని లోటని ఆత్రేయ స్మారక కళాపీఠం ప్రధాన కార్యదర్శి గంటి మురళీధర్ పేర్కొన్నారు. కళాపీఠం తరఫున పురస్కారాన్ని ప్రస్తుత డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి చేతుల మీదుగా అందజేశామని గుర్తుచేశారు. నోరారా మురళీ అని పిలిచే ఆ కంఠం మూగబోయిందన్న వార్త జీర్ణించుకోలేకపోతున్నాన ని, ఆయన పవిత్ర ఆత్మకు శాంతిచేకూరాలని ప్రార్థిస్తున్నామన్నారు.




ఆత్రేయ పురస్కార సభలో విశ్వనాథ్‌కు తిలకం దిద్దుతున్న ప్రస్తుత డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి (ఫైల్)

- గురజాడ సాంస్కృతిక సమాఖ్య గురజాడ విశిష్ట పురస్కారాన్ని అందించినప్పటి నుంచి విశ్వనాథ్‌తో ఎనలేని పరిచయం ఏర్పడిందని సమాఖ్య ప్రధాన కార్యదర్శి కాపుగంటి ప్రకాష్ పేర్కొన్నారు.
- విజయనగరం అక్కినేని అభిమాన సంఘం ఆధ్వర్యంలో కంటుభుక్త దుర్గాప్రసాద్, దారా వెంకట్, నాగేష్, కృష్ణ, కిరణ్‌లు తమ సంతాపాన్ని తెలిపారు. ఆత్మగౌరవం, శంకరాభరణం, సాగర సంగమం, స్వాతిముత్యం ఇలా అనేక కళాఖండాలను తెరకెక్కించిన గొప్పవ్యక్తి విశ్వనాథ్ అని కొనియాడారు. విశ్వనాథ్ మృతి తెలుగు ప్రేక్షకులకు తీరని లోటని తెలుగు భాషా పరిరక్షణ సమితి అధ్యక్షుడు సముద్రాల గురుప్రసాద్ పేర్కొన్నారు. 2017లో విశ్వనాథ్ సినీజీవిత విశేషాలపై తాను రాసిన కళా తపస్వీ పుస్తకాన్ని హైదరాబాద్‌కు చెందిన కిన్నెర పబ్లికేషన్స్ ప్రచురించి, ఆ మహనీయుడి పుట్టినరోజున ఆయన స్వగృహంలో ఆవిష్కరించారన్నారు. సినీమాధ్యమానికి ఒక శృతిని ఒక లయను సమకూర్చిన కళాతపస్వీ విశ్వనాథ్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

చిత్ర నివాళి

సంగీతం, సాహిత్యంతో పాటూ మన సంస్కృతి, సంప్రదాయాలను మేళవించి, తెలుగు సినిమాకు పునర్జీవాన్నిచ్చి మహోన్నత వ్యక్తిగా అంతర్జాతీయ స్థాయిలో తెలుగు వాడి గౌరవాన్ని పెంపొందించిన నటుడు, దర్శకుడు కె.విశ్వనాథ్ మృతి తీరనిలోటని విజయనగరానికి చెందిన చిత్రకారిణి, లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్ హోల్డర్ సిరిపురపు ప్రవల్లికా నారాయణ్ పేర్కొన్నారు. 2009లో రవీంద్రభారతిలో ఆయన చేతుల మీదుగా సంకల్ప్, బాలమేధావి పురస్కారం తీసుకోవడం తన పూర్వజన్మసుకృతంగా భావిస్తున్నామన్నారు. ఆయన మృతికి చిత్రంతో నివాళులర్పించారు.



టీడీపీతో పొత్తు ప్రసక్తే లేదు

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోమువీర్రాజు



విలేకరుతో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోమువీర్రాజు

పాలకొండ రూరల్/పాలకొండ:

తెలుగుదేశం పార్టీతో పొత్తుపెట్టుకునే ప్రసక్తే లేదని, జనసేనతో కలిసి ఎన్నికల్లో పోటీచేస్తామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోమువీర్రాజు స్పష్టం చేశారు. పాలకొండలోని ఓ ప్రైవేటు కల్యాణమండపంలో శుక్రవారం నిర్వహించిన పార్టీ జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. టీడీపీ కుటుంబ పార్టీగా అభివర్ణించారు. అనంతరం విలేకరుతో మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌తో ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందుతుందన్నారు. జిల్లాలో ఏనుగుల సమస్య పరిష్కారానికి తన వంతుగా కృషి చేస్తానన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ మాధవ్, జిల్లా అధ్యక్షుడు డి. శ్రీనివాసరావు, రాష్ట్ర నా యకులు పి.వేణుగోపాలరావు, కె.నారాయణ రావు, పెద్దబాబు, తాడంగి సునీత, హెచ్.ప్రసాద్, కందుల జగన్నాథకుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీల్లో కేజీబీవీ విద్యార్థినుల ప్రతిభ



విద్యార్థినులను అభినందిస్తున్న పాఠశాల ప్రత్యేకఅధికారి బేగం, పీఈటీ రామలక్ష్మి

మెరకముడిదాం: మండల కేంద్రంలోని కేజీబీవీ విద్యార్థినులు రాష్ట్రస్థాయి రోప్‌స్కిప్పింగ్ క్రీడా పోటీల్లో ఉత్తమప్రతిభ కనబరిచారు. జనవరి 28, 29, 30 తేదీల్లో భీమవరంలో జరిగిన రాష్ట్ర స్థాయి అండర్-14 రోప్ స్కిప్పింగ్ పోటీల్లో యు.పూజిత, అండర్-19లో కె.సంధ్య తృతీయ స్థానంలో నిలిచి కాంస్యపతకాలను సాధించారు. ఈ విద్యార్థినులకు పాఠశాల ప్రత్యేక అధికారి ఎస్.కె.గౌసియాబేగం, పీఈటీ బి.రామలక్ష్మిలు అభినందనలు తెలిపారు. వారితో పాటు పాఠశాల ఉపాధ్యాయసిబ్బంది, ఉపాధ్యాయేతర సిబ్బంది విద్యార్థినులను అభినందించారు.

తైక్వాండో పోటీల్లో బెస్ట్ ప్లేయర్ రేణుక



విద్యార్థిని రేణుకా శ్రీకరిణిని అభినందిస్తున్న పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరిగిన తైక్వాండో పోటీల్లో స్థానిక బాబామెట్ట ప్రభుత్వ బాలికల పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న మొకర రేణుకా శ్రీకరిణి సత్తా చాటింది. ఇటీవల అనకాపల్లిలో గత నెల 29, 30, 31 తేదీల్లో జరిగిన అంతర్ జిల్లాల చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొన్న రేణుక రెండు బంగారు పతకాలు సాధించి టోర్నీ బెస్ట్ ప్లేయర్ అవార్డు సొంతం చేసుకుంది. అంతేకాకుండా ఈనెల 26 నుంచి 28వ తేదీ వరకు హైదరాబాద్‌లో జరగబోయే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయరాలు తెలిపారు. త్వరలో జరగనున్న జాతీయ పోటీల్లో పతకాలు సాధించి పాఠశాలకు, జిల్లాకు మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ప్రిన్సిపాల్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

హోరాహోరీగా ఎస్‌పీఎల్ క్రికెట్ లీగ్

- సీనియర్స్‌లో మిరాకిల్, అవంతి రీసెర్చ్ కళాశాల జట్ల విజయం
- జూనియర్స్‌లో ఫైనల్‌కు చేరిన ఆర్.కె.జూ.కళాశాల



అవంతి ఇంజనీరింగ్-గోకుల్ ఇనిస్టిట్యూట్ జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్



విజయం సాధించిన అవంతి రీసెర్చ్ కళాశాల జట్టు



విజయం నమోదు చేసిన మిరాకిల్ కళాశాల జట్టు



సెమీఫైనల్‌కు చేరిన భాస్కర్ జూనియర్ కళాశాల జట్టు



ఫైనల్‌కు చేరిన ఆర్.కె.జూనియర్ కళాశాల జట్టు

SAKSHI | సాక్షి | SAKSHI DIGITAL | MEDIA GROUP

SPL | SAKSHI PREMIER LEAGUE

విజయనగరం రూరల్: సాక్షి మీడియా ఆధ్వర్యంలో స్థానిక జేఎన్‌టీయూ గురజాడ విశ్వవిద్యాలయం మైదానంలో మూడు రోజులుగా సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ మ్యాచ్‌లు హోరాహోరీగా జరుగుతున్నాయి. మూడో రోజు శుక్రవారం నిర్వహించిన క్రికెట్ పోటీల్లో సీనియర్ విభాగానికి మిరాకిల్-అవంతి రీసెర్చ్ కళాశాల జట్లు ప్రత్యర్థి జట్లపై విజయం సాధించాయి. జూనియర్ విభాగంలో ఆర్.కె.జూనియర్ కళాశాల విజయం సాధించి ఫైనల్‌కు చేరుకుంది.

అవంతి ఫార్మశీపై మిరాకిల్ విజయం

అవంతి ఫార్మశీ కళాశాల జట్టు మిరాకిల్ ఎడ్యుకేషనల్ కళాశాల జట్ల మధ్య గురువారం ఉదయం జరిగిన మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన అవంతి ఫార్మశీ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 6 వికెట్లు నష్టపోయి 82పరుగులు సాధించింది. అనంతరం 83పరుగుల విజయలక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన మిరాకిల్ జట్టు 9.1 ఓవర్లలో 83పరుగులు సాధించి లక్ష్యాన్ని చేరుకుంది.

అవంతి రీసెర్చ్ కళాశాల విజయ దుందుభి

అవంతి రీసెర్చ్ అండ్ టెక్నాలజీ కళాశాల-గోకుల్ కళాశాల జట్ల మధ్య జరిగిన మరో మ్యాచ్‌లో అవంతి జట్టు 8 వికెట్ల తేడాతో గెలుపొందింది. ముందు గా బ్యాటింగ్ చేపట్టిన గోకుల్ కళాశాల జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 3వికెట్ల నష్టానికి 86పరుగులు చేయగా 87పరుగుల విజయలక్ష్యంతో బ్యాటింగ్ చేపట్టిన అవంతి రీసెర్చ్ జట్టు 8.3ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి విజయాన్ని సాధించింది.

సెమీస్‌లో భాస్కర్ జూనియర్ కళాశాల:

మధ్యాహ్నం జూనియర్ విభాగంలో జరిగిన తొలిమ్యాచ్‌లో భాస్కర్ జూనియర్ కళాశాల జట్టు భారత్ జూనియర్ కళాశాల జట్టుపై 21పరుగుల తేడాతో గెలుపొంది సెమీఫైనల్‌కు చేరుకుంది. ముందుగా బ్యాటింగ్ చేసిన భాస్కర్ కళాశాల జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 4వికెట్లు కోల్పోయి 91పరుగులు సాధించింది. అనంతరం 92 పరుగుల విజయలక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన భారత్ కళాశాల జట్టు 10ఓవర్లలో 2వికెట్లు కోల్పోయి 70పరుగులు మాత్రమే సాధించి విజయానికి 21పరుగుల దూరంలో నిలిచింది.

ఫైనల్స్‌కు ఆర్.కె.కళాశాల జట్టు:

సాయంత్రం జూనియర్ విభాగంలో జరిగిన తొలి సెమీఫైనల్‌లో ఆర్.కె.జూనియర్ కళాశాల జట్టు శ్రీనివాస జూనియర్ కళాశాల జట్టుపై 10వికెట్ల తేడాతో సునాయాస విజయం సాధించి ఫైనల్‌కు చేరుకుంది. ముందుగా బ్యాటింగ్ చేసిన శ్రీనివాస జూనియర్ కళాశాల జట్టు నిర్ణీత ఓవర్లలో 5వికెట్లు నష్టపోయి 43పరుగులు సాధించగా 44పరుగుల విజయలక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన ఆర్.కె.జూనియర్ కళాశాల జట్టు కేవలం 3.4ఓవర్లలోనే వికెట్ నష్టపోకుండా 47 పరుగులు సాధించి విజయాన్ని అందుకుంది.

రీ సర్వేకు సహకరిస్తే రైతుకే లాభం

- సమీక్ష సమావేశంలో కలెక్టర్ సూర్యకుమారి



మాట్లాడుతున్న కలెక్టర్ సూర్యకుమారి

విజయనగరం అర్బన్: భూముల రీ సర్వే ప్రక్రియ వేగం పెంచాలని తహసీల్దార్లను కలెక్టర్ సూర్యకుమారి ఆదేశించారు. రైతులకు రీ సర్వేపై అవగాహన కలిగించాలని సూచించారు. పక్కా పాస్ బుక్ కలిగి ఉన్నప్పటికీ వెరిఫికేషన్ చేయించుకోవడం వల్ల రైతుకే మేలు జరుగుతుందన్నారు. రైతు ఉన్నా లేకపోయిగా కొలతలు కచ్చితంగానే ఉంటాయని చెబుతూ రైతు సమక్షంలో సర్వే జరిగితే క్లియర్ టైటిల్ డీడ్ పొందగలరని రైతులకు చెప్పాలని కోరారు. ఎక్కువగా సర్వేయర్లు ఉన్న చోట నంచి డిప్యుటేషన్ వేయాలని ఆర్‌డీఓకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో విజయనగరం డివిజన్ సంబంధించి సుస్థిర అభివృద్ధి సూచీలు, రీ సర్వే తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. రీ సర్వే నెమ్మదిగా జరుగుతున్న మండలాల అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. క్షేత్ర స్థాయిలో రోజుకు కనీసం వంద ఎకరాలకు తగ్గకుండా సగటున 150 ఎకరాలు వరకు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. రైతుల సమక్షంలోనే వారి పొలం రీసర్వే జరిగేలా చూడాలని గ్రామసభలు నిర్వహించాలని చెప్పారు. జూన్ నాటికి సర్వే పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించిందని, అంతకు ముందుగానే జిల్లాలో సర్వే ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

రక్త హీనత నివారించండి

సుస్థిర అభివృద్ధి సూచీలలో ముఖ్యమైనవి వైద్యం, ఆరోగ్యం, పిల్లలు, గర్భిణీల ఆరోగ్యమే ఐసీడీఎస్‌కు ప్రధానమన్నారు. మండలాల వారీగా పిల్లలు, విద్యార్థులు, మహిళలకు నిర్వహించిన రక్త పరీక్షలపై కలెక్టర్ ఆరా తీశారు. తీవ్ర, అతి తీవ్ర, స్వల్ప రక్త హీనత ఉన్న వారిని గుర్తించి, వారు దాని నుంచి బయట పడేవిధంగా కౌన్సెలింగ్ నిర్వహించి, పోషకాహారం, అవసరమైన మందులను అందించాలని సూచించారు. ఈ సమీక్షలో ఆర్డీవో సూర్యకళ, సీపీఓ పి.బాలాజీ, డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్వీ రమణకుమారి, డీఈఓ లింగేశ్వరెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీరాములునాయుడు, కేఆర్ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణ, సర్వేశాఖ ఎ.డి త్రివిక్రమరావు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, ఎంఈఓలు, సీడీపీఓలు, మెడికల్ ఆఫీసర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఎం పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం ఫోర్ట్: నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం)లో ఖాళీగా ఉన్న పోస్టులకు అర్హతగల అభ్యర్థులు ఈనెల 10వతేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్వీ రమణకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎపిడిమాలజిస్టు-1 పోస్టు, ఆర్‌కేఎస్‌కేలో డెంటల్ టెక్నీషియన్ పోస్టు 1, ఆడియాలజిస్టు కం థెరపిస్టు -1 పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

రెండు బైక్‌ల ఢీ: ఒకరికి గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీనివాసరావు

పార్వతీపురం: పట్టణంలోని బంగారమ్మ కాలనీకి చెందిన మొయిద శ్రీనివాసరావు పార్వతీపురం నుంచి ద్విచక్రవాహనంపై రాయగడ వెళ్తుండగా అదే మార్గంలో కోటిపాం మిల్లు వద్ద ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనం బలంగా ఢీకొట్టింది. దీంతో కొందపడిన శ్రీనివాసరావు గాయాలపాలయ్యాడు. స్థానికుల సమాచారం మేరకు 108 వాహనం వచ్చి పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించింది. ఈ ఘటనపై ఔట్‌పోస్టు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సకాలంలో గుర్తిస్తే..

క్యాన్సర్..క్యాన్సిల్

- ఆత్మవిశ్వాసమే ఉత్తమ వైద్యం
- క్యాన్సర్‌కు అందుబాటులో అధునాతన చికిత్స
- నేడు వరల్డ్ క్యాన్సర్ డే



ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఎఫ్ఎన్ఏసీ పరీక్ష చేస్తున్న వైద్యుడు

విజయనగరం ఫోర్ట్: మానవుని జీవని శైలిలో మార్పుల కారణంగా క్యాన్సర్ వ్యాప్తి తీవ్రమవుతోంది. పూర్వీకులు ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడంతో అతి తక్కువ మందే వ్యాధి బారిన పడేవారు. కానీ నేడు పాశ్చాత్య పోకడలకు పోయి పిజ్జాలు, బర్గర్లు వంటివి అధికంగా తినడం వల్ల ప్రాణాంతక క్యాన్సర్ వ్యాధి బారినపడుతున్నారు. శనివారం వరల్డ్ క్యాన్సర్ డే సందర్భంగా సాక్షి ప్రత్యేక కథనం.

గతంతో పోల్చితే క్యాన్సర్ వ్యాధిగ్రస్తుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. గ్రామాల్లో అవగాహన లేక గతంలో క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయించుకునేవారుకాదు. దీంతో రోగులు ఏవ్యాధితో చనిపోయేవారో తెలిసేది కాదు. ప్రస్తుతం ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెరిగింది. దీంతో ఏచిన్న ఆరోగ్య సమస్య వచ్చినా చికిత్స చేయించుకోవాలనే ఆలోచన వస్తోంది. క్యాన్సర్ స్క్రీనింగ్ పెరగడం వల్ల వ్యాధి ఎంతమందికి ఉందో తెలుస్తోంది. చాలా మంది క్యాన్సర్ అనగానే భయందోళన చెందుతారు. ఆ భయంతో త్వరగా చనిపోతున్నారు. క్యాన్సర్ వచ్చినా భయపడాల్సిన పని లేదని, ప్రాణాంతకమైన వ్యాధిని అయినా ఆత్మవిశ్వాసంతో జయించవచ్చునని వైద్యనిపుణులు చెబుతున్నారు.

ప్రాథమిక దశలో గుర్తిస్తే మేలు

దేశంలో ఏడాదికి 40 లక్షల మంది క్యాన్సర్ బారిన పడుతున్నారు. కాలంతో పాటు జీవనశైలిలో మార్పులు, కాలుష్యం, అలవాట్లు, ఆహార పదార్థాలు, ఇలా అనేక కారణాల వల్ల క్యాన్సర్ వస్తుంది. ప్రాథమిక దశలో గుర్తించి చికిత్స పొందడం ద్వారా మరణాన్ని జయించవచ్చు. ఇప్పటికే ఎంతో మంది ఈ తరహా చికిత్స తీసుకుంటూ బతికి బయటపడ్డారు.

నాలుగు దశలు:

మద్యపానం, ధూమపానం వంటి వ్యసనాలు, స్థూలకాయం, కూరగాయలు మితంగా తినడం, శారీరక శ్రమకు ప్రాధాన్యమివ్వకపోవడం లాంటి వారికి క్యాన్సర్ సోకే ప్రమాదం ఉంది. నాలుగు దశల్లో క్యాన్సర్‌ను గుర్తించవచ్చు. మొదటి దశలో క్యాన్సర్ కణాల్ని స్క్రీనింగ్ ద్వారా గుర్తించి సరైన చికిత్స అందించవచ్చు. ఇలా చేయడం ద్వారా 95 నుంచి 100 శాతం వరకు వ్యాధినయం చేయవచ్చు. రెండో దశలో కేన్సర్ కణాలు ఒక భాగం నుంచి ఇతర భాగాలకు కొంచెం, కొంచెంగా విస్తరిస్తాయి. వాటికి రెడిషథెరపీ అందిస్తే 70 నుంచి 80 శాతం వరకు నయమవుతుంది. ఇక మూడో దశలో క్యాన్సర్ ఇతర భాగాలకు పూర్తిగా విస్తరిస్తుంది. రేడియేషన్, కీమోథెరపీ ఇస్తే 50 నుంచి 60 శాతం మందికి తగ్గుముఖం పడుతుంది. ఇక చివరి దశలో క్యాన్సర్ కీలకమైన అవయవాలకు సోకుతుంది. ఇలాంటి వారికి చికిత్స అందించినా ఆశించిన ఫలితం ఉండదు. కేవలం 5 నుంచి 10 శాతం మంది మాత్రమే బతికే అవకాశాలుంటాయి.

క్యాన్సర్ నివారణకు అనేక చికిత్సలు

అవగాహన లేక, త్వరగా గుర్తించక చాలా మంది క్యాన్సర్ బారిన పడుతున్నారు. దశలను బట్టి క్యాన్సర్‌కు చికిత్సలు ఉన్నాయి. కొన్ని దశల్లో రెండు రకాల చికిత్సలు ఉంటే, 3, 4 దశల్లో క్యాన్సర్‌కు 2, 3 రకాల వైద్యం అందించాల్సి ఉంది. చికిత్స జరిగిన తర్వాత రెండేళ్ల పాటు రెండునెలలకోసారి, మూడేళ్లతర్వాత మూడు నెలలకోసారి, ఐదేళ్ల తర్వాత 5 నెలలకోసారి, వైద్యుడిని సంప్రదించాల్సిన అవసరం ఉంది.

ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో వ్యాధి నిర్ధారణ

గతంలో క్యాన్సర్ నిర్ధారణ పరీక్షల కోసం విశాఖపట్నం వెళ్లాల్సి వచ్చేది. కానీ ప్రస్తుతం జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రస్తుతం విజయనగరం జిల్లా కేంద్రంలో ఉన్న ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో క్యాన్సర్ నిర్ధారణకు ఓ విభాగాన్ని ఏర్పాటు చేసింది. మహిళల్లో వచ్చే బ్రెస్ట్, సర్వైకల్ కేన్సర్‌లకు సర్వజన ఆస్పత్రిలోనే శస్త్రచికిత్స చేస్తున్నారు.

ఉచితంగా వైద్యం

ఆరోగ్యశ్రీ పథకంలోకి కేన్సర్ వ్యాధి రాకముందు రోగులు చికిత్స కోసం ఆస్తులు, భూములు తాకట్టు పెట్టి వైద్యం చేయించుకునే వారు. జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం క్యాన్సర్‌ను ఆరోగ్యశ్రీ పథకంలో చేర్చి క్యాన్సర్ రోగులకు ఉచితంగా వైద్యం అందిస్తోంది. దీంతో ఎంతో మంది ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స పొంది క్యాన్సర్ నుంచి విముక్తి పొందుతున్నారు.

బాధితుల్లో ధైర్యం నింపాలి



క్యాన్సర్ అనగానే వ్యాధిగ్రస్తులు భయపడతారు. కాబట్టి వ్యాధి సోకిన వారిలో ధైర్యం నింపాలి. క్యాన్సర్ వచ్చినా భయపడాల్సిన అవసరం లేదన్న విషయాన్ని చెప్పాలి. అది ఏస్థితిలో ఉన్నా నియంత్రించవచ్చు. ఎంతో మంది వ్యాధిని జయించి సాధారణ జీవితాన్ని గడుపుతున్నారు. క్యాన్సర్ రోగులకు ఎక్కువగా నొప్పులు వస్తాయి. అటువంటి వారికి పాలియేటివ్ థెరపీ ద్వారా చికిత్స అందిస్తారు.

గాడి మురళీ కృష్ణ, ఎన్‌సీడీ జనరల్ ఫిజీషియన్, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి

క్యాన్సర్ నియంత్రణకు ఎన్నో చికిత్సలు



దేశంలో ప్రతి 15 మందిలో ఒకరికి క్యాన్సర్ ముప్పు పొంచి ఉంటోంది. చాలా మంది అవగాహన లేక త్వరగా గుర్తించక క్యాన్సర్ బారిన పడుతున్నారు. దశలను బట్టి చికిత్సలు ఉంటాయి. కొన్ని దశల్లో రెండు రకాల చికిత్సలు ఉంటాయి. చికిత్స జరిగిన తర్వాత రెండేళ్ల పాటు రెండు నెలలకు ఒకసారి, మూడేళ్ల తర్వాత మూడు నెలలకు ఒకసారి. ఐదేళ్ల తర్వాత ఐదు నెలలకు ఒకసారి వైద్యుడిని సంప్రదించాలి.

డాక్టర్ బి.రవిశంకర్, క్యాన్సర్ వైద్య నిపుణుడు

రెండు ద్విచక్రవాహనాలను ఢీ కొట్టిన జీపు

- ఒకరి మృతి
- మరో ముగ్గురికి గాయాలు



ప్రమాదంలో మృతిచెందిన సన్నిబాబు



కాలు విరిగిపోయిన దేముడమ్మ, కుడిచేయి విరిగిపోయిన షేక్ లక్ష్మణరావు

వేపాడ: మండలంలోని చినగుడిపాల సమీపంలో శివ కాన్వెంట్ జంక్షన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో చినగుడిపాలకు చెందిన బాలిబోని సన్నిబాబు (52) మృతి చెందగా మరో ముగ్గురు గాయాలపాలయ్యారు. ఇందుకు సంబంధించి 108 సిబ్బంది, చినగుడిపాల సర్పంచ్ రామునాయుడు స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బాలిబోని సన్నిబాబు కొన్నేళ్లుగా నీలకంఠరాజపురం గ్రామానికి చెందిన వ్యక్తి పొలాన్ని కౌలు చేస్తున్నాడు. ఎప్పటిలాగానే శుక్రవారం ఉదయం 7.30 గంటలకు తన టీవీఎస్ ఎక్సెల్ వాహనంపై భార్య దేముడమ్మతో కలిసి పొలం పనికి వెళ్తుండగా దేవరాపల్లి-ఆనందపురం రహదారిలో దేవరాపల్లి నుంచి ఆనందపురం వెళ్తున్న జీపు ఢీ కొట్టి ఎక్సెల్ వాహనాన్ని ఈడ్చుకుపోయింది. దీంతో వాహనంపై ప్రయాణిస్తున్న భార్యాభర్తలు రోడ్డుపై పడిపోయారు. ఈ ప్రమాదంలో సన్నిబాబు స్పృహకోల్పోగా, దేముడమ్మ కాలు విరిగిపోయింది. అదే జీపు దేవరాపల్లి వైపు వెళ్తున్న మరో స్కూటీని ఢీ కొట్టంది. దీంతో ఆ స్కూటీపై ప్రయాణిస్తున్న ఇద్దరు గాయాలపాలయ్యారు. వారిద్దరు వేపాడ మండలం భర్తవానిపాలెం గ్రామానికి చెందినవారు. భర్తవానిపాలెం గ్రామానికి చెందిన షేక్ లక్ష్మణరావు ఆనందపురం నుంచి తిమిరాం సంతకు వెళ్తుండగా అదే గ్రామానికి చెందిన దండి సంజీవరావు రైవాడ కెనాల్‌లో డ్యూటీకి వెళ్లేందుకు ఆనందపురంలో నిరీక్షిస్తున్నాడు. దీంతో అటుగా వస్తున్న లక్ష్మణరావు స్కూటీపై సంజీవరావు కూడా ఎక్కగా ఇద్దరూ కలిసి దేవరాపల్లి వైపు వెళ్తుండగా జీపు ఢీకొట్టడంతో కింద పడి గాయాలపాలయ్యారు. లక్ష్మణరావు, సంజీవరావులకు కుడిచేతులు విరిగిపోయాయి.

క్షతగాత్రులకు విశాఖలో చికిత్స

స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి వేపాడ, దేవరాపల్లి 108 వాహనాలు చేరుకుని సన్నిబాబు, దేముడమ్మ, సంజీవరావు, లక్ష్మణరావులను కోటపాడు ఆస్పత్రికి తరలించాయి. ఆస్పత్రిలో డ్యూటీ డాక్టర్ పరీక్షించి సన్నిబాబు (52) చనిపోయినట్లు నిర్ధారించారు. గాయాలపాలైన ముగ్గురికి ప్రథమ చికిత్స అనంతరం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. మృతుడు సన్నిబాబుకు భార్య దేముడమ్మ, కుమారుడు దేముడునాయుడు (ఆటోడ్రైవర్) వికలాంగురాలైన కుమార్తె దేముడమ్మ ఉన్నారు. ఈ సంఘటనపై మృతుడి భార్య ఫిర్యాదుమేరకు దేవరాపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. జీపు డ్రైవర్ పరారీలో ఉన్నాడు.

ధాన్యం దగ్ధం

- రూ.2లక్షల నగదు బూడిద



మిర్తివలస వద్ద కృష్ణసాగరం సమీపంలో దగ్ధమైన ధాన్యం బస్తాలు

బలిజిపేట: మండలంలోని మిర్తివలస వద్ద కృష్ణసాగరం చెరువు సమీపంలో జరిగిన అగ్నిప్రమాదంలో 17మంది రైతులకు చెందిన 80కిలోల ధాన్యం బస్తాలు 370, ఒక రైతుకు చెందిన రూ.2లక్షల నగదు కాలి బూడిదయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. మిర్తివలస సమీపంలో కృష్ణసాగరం చెరువువద్ద పొలాలలో ధాన్యం బస్తాలను విక్రయించేందుకు రైతులు సిద్ధం చేసి ఉంచారు. చెరువులో తుప్పలు, డొంకలకు ఎవరో నిప్పు పెట్టడంతో నిప్పురవ్వలు పంటపొలాలల్లోకి వచ్చి అక్కడ ఉన్న ధాన్యం బస్తాలు దగ్ధమయ్యాయి. వాటిలో మిర్తివలసకు చెందిన రైతు జి.సింహాచలం ధాన్యం ఉన్నాయి. ఈ విషయం ఆయనకు ఫోన్‌చేసి గ్రామస్తులు తెలపడంతో నగదు పట్టుకుని ఎక్కడికో వెళ్తున్న సింహాచలం ఆందోళనతో అక్కడికి వచ్చి నగదు ఉన్న బ్యాగును దూరంగా ఉంచి మంటలను ఆర్పే ప్రయత్నం చేస్తుండగా నిప్పు పొలం గట్టుపైనుంచి నగదు ఉన్న బ్యాగువైపు వెళ్లడంతో అందులో ఉన్న నోట్లు కాలిపోయాయి. దీంతో ఆ రైతు లబోదిబో మంటున్నాడు. ఈ ప్రమాదంలో జి.సింహాచలం, డి.మజ్జయ్య, పి.సత్యనారాయణ, అప్పయ్య, విమల, సి.సూర్యారావు, డి.రామకృష్ణ తదితరులు ధాన్యం బస్తాలు కోల్పోయారు. సమాచారం మేరకు బొబ్బిలి నుంచి అగ్నిమాపక యంత్రం వచ్చి మంటలను అదుపుచేసింది.



కాలిపోతున్న నీలగిరి తోటలు

నీలగిరి తోటలు..

గరుగుబిల్లి: మండలంలోని ఉల్లిభద్ర రెవెన్యూ పరిధిలోగల రైతులకు సంబంధించిన నీలగిరి తోటలు దగ్ధమయ్యాయి. శుక్రవారం సాయంత్రం జరిగిన ఈఘటనలో నీలగిరి తోటలతో పాటు కేబుల్ కనెక్షన్ వైర్లు, రెండు సోలార్ మోటార్లు కాలి బూడిదయ్యాయని స్థానికులు చెబుతున్నారు. అయితే ఈ ప్రమాదం ఎలా జరిగిందో తెలియాల్సి ఉంది. అకస్మాత్తుగా ప్రమాదం జరగడంతో ఈ ప్రాంతీయులు ఆందోళన చెందుతున్నారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 547.00
విజయనగరం	రూ. 547.00
శ్రీకాకుళం	రూ. 551.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24కి. 10గ్రా.)	54,930-00
బంగారం(22కి. 10గ్రా.)	50,350-00
వెండి (కిలో)	74,500-00

చికెన్

బ్రాయిలర్		
లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹105	₹180	₹ 190